## వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి..

### రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

బంజారాహిల్స్, ఏప్రిల్ 24: వేసవి సెలవుల్లో బంధువుల ఇంట్లో గడుపుదామని బయలుదేరిన బాలిక రోడ్డు ప్రమాదంలో మరణించింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివాసి గురవయ్య కొబ్బరి బోండాల వ్యాపారి. అతడికి ఇద్దరు పిల్లలు. కుమార్తె శిరీష(15) పదో తరగతి చదువుతోంది. శిరీష చిన్నమ్మ కళ్యాణి కుటుంబం ఫిలింనగర్‌లో ఉంటోంది. కళ్యాణి భర్తతో కలిసి వారి సొంతూరు ఖమ్మం వెళ్లగా.. ముగ్గురు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. శిరీషకు పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో వేసవి సెలవుల్లో భాగంగా వారం రోజులపాటు చిన్నమ్మ ఇంట్లో ఉండి రావాలని శిరీష భావించింది. దీంతో కళ్యాణి కొడుకు (14)కు ఫోన్ చేయగా.. అతడు మంగళవారం రాత్రి బైక్‌పై శిరీషను ఎక్కించుకుని ఫిలింనగర్‌కు బయలుదేరాడు. యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో బైక్ ప్రమాదానికి గురైంది. వెనుకాల కూర్చున్న శిరీష కిందపడిపోవడంతో బస్సు వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మైనర్‌పై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నదని పోలీసులు తెలిపారు.

## ఇక గ్రామాల్లోనూ టీఎస్ బీపాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ అనుమతులను ఎంతో పారదర్శకంగా, వేగవంతంగా ఇచ్చే టీఎస్ బీపాస్ ఇప్పుడు గ్రామ పంచాయతీల్లోనూ అందుబాటులోకి రానున్నది. ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధి వరకే పరిమితమైన ఈ ఆన్‌లైన్ విధానాన్ని ఇక నుంచి హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామాల్లోని ప్రజలు సైతం టీఎస్ బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు, జీపీ లేఅవుట్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి,యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలు ఉండగా, ఈ జిల్లాల్లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీలే కాకుండా గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయి. ఇవి సుమారు 1032 గ్రామాల వరకు ఉంటాయి. ఇప్పటి వరకు డీపీఎంఎస్, డీటీసీపీ పరిధిలో అనుమతులు తీసుకున్న గ్రామాలను, ఇక నుంచి టీఎస్ బీపాస్ పరిధిలోకి తీసుకొచ్చామని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం జోనింగ్ నిబంధనలు మార్చుకునేందుకు ఉన్న చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ (సీఎల్‌యూ) మినహా బిల్డింగ్ పర్మిషన్, జీపీ లేఅవుట్ పర్మిషన్ కోసం టీ ఎస్ బీపాస్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్ లింకు హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్ నుంచే అనుసంధానం చేసినట్లు వివరించారు.

## గ్రేటర్ @ 40 డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు మండుతున్నాయి. దీనికి తోడు గాలిలో తేమ శాతం తగ్గుముఖం పట్టడంతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 40.0, కనిష్ఠం 26.6 డిగ్రీలు, గాలిలో తేమ 20 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# సాక్ష్యాలేవీ కోర్టుకు సమర్పించలేదు

## సేకరించిన హార్డ్ డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌లేవీ?

### ఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులు అతి చేస్తున్నారు

### నాంపల్లి కోర్టులో వాదనలు.. బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుల తరఫున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై బుధవారం వాదనలు ముగిశాయి. ఇరువైపులా వాదనలు విన్న నాంపల్లి కోర్టులోని 1వ సెషన్ కోర్టు జడ్జి రమాకాంత్‌రావు.. 26కు తీర్పు రిజర్వ్ చేశారు. అధికారుల తీరు వల్లే ఈ కేసు గురించి ప్రచారం జోరుగా జరుగుతున్నదన్నారు. ఇప్పటి వరకు సేకరించిన హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, పెన్‌డ్రైవ్‌లు, లాప్‌టాప్‌లను కోర్టుకు సమర్పించలేదని, అధికారులు దాఖలు చేసిన కౌంటర్‌లో మాత్రం వందల కొద్దీ సాక్ష్యాధారాలను సేకరించాల్సి ఉన్నదని నమోదు చేయడం అవాస్తవమని నిందితుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కుట్రపూరితంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని అధికారులు నడిపినట్టు పేర్కొనడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా డబ్బు రవాణా పట్ల చర్యలు తీసుకోవడం అధికారులుగా వారి బాధ్యత అని అన్నారు. ఉన్నతాధికారి ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఈ వ్యవహారం జరిగిందని అధికారులను అరెస్టు చేశారని, ఏఫ్ఐఆర్‌లో మాత్రం ప్రభాకర్‌రావు పేరును చేర్చకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో నమోదు చేయకుండా కౌంటర్‌లో ఆయన గురించి ప్రస్తావించడం చట్ట విరుద్ధమన్నారు. మూసీనదిలో పడేసిన హార్డ్ డిస్క్‌లను అధికారులు సేకరించినట్టు తెలిపినప్పటికీ, వాటిని కోర్టు ఎదుట దాఖలు చేయలేదన్నారు. తేలికపాటి హార్డ్ డిస్క్‌లు మూసీ కాలువ నీటి ప్రవాహానికి కొట్టుకుపోతాయని, మూడు నెలల అనంతరం అధికారులు సేకరించామని తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. బెయిల్ మంజూరు చేస్తే బాధితులు, సాక్షులను, సాక్ష్యాధారాలను నిందితులు తారుమారు చేసే ప్రసక్తే లేదన్నారు. వందల్లో బాధితులు, సాక్షుల విచారణ కొనసాగించాల్సి ఉన్నదని తెలుపడం హాస్యాస్పదమన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఎస్.సాంబశివరెడ్డితోపాటు తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది రమాకాంత్‌రెడ్డి అధికారుల తరఫున వాదనలు వినిపించారు. విచారణ కొనసాగుతున్నదని, ఫోన్ ట్యాపింగ్ మాత్రమే ఈ కేసుకు సంబంధంలేదని, అధికారుల వాహనాల్లో డబ్బులను రవాణా చేసి ఇతరులకు అందించారని పీపీ తెలిపారు. హైకోర్టు, సుప్రీం కోర్టులకు చెందిన జడ్జిమెంట్లను కోర్టుకు సమర్పించి, వాటి గురించి సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. అధికారులు తప్పుచేశారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

## కర్ణాటక కేంద్రంగా తెలంగాణకు డీజిల్ స్మగ్లింగ్

### ఆరుగురి అరెస్టు..

### రూ.10.36 లక్షల డీజిల్ స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కేంద్రంగా తెలంగాణ రాష్ట్రానికి డీజిల్ స్మగ్లింగ్ చేస్తూ, రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న ఒక ఘరానా ముఠా గుట్టును సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు రట్టు చేశారు. పోలీసు అధికారుల కథనం ప్రకారం.. కర్ణాటకలో డీజిల్ ధర రూ.86.39 కాగా, తెలంగాణలో డీజిల్ ధర రూ.95.65 ఉంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య డీజిల్ ధర 9 రూపాయల తేడా ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న రాధాకృష్ణ కర్ణాటకలో డీజిల్‌ను కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని పలువురికి సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు కోట్ల రూపాయల గండి పడుతోంది. ఈ మేరకు సమచారం అందుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటీ బృందం గచ్చిబౌలి పోలీసులతో కలిసి నిఘా పెట్టారు. వట్టి నాగులపల్లిలోని శ్రీదేవి ఇంజినీర్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డీజిల్ నిల్వ కేంద్రంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.10.36 లక్షల విలువజేసే 10,800 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. అంతే కాకుండా, అక్రమంగా డీజిల్‌ను రవాణా చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లు మహ్మద్ షానవాజ్, మహ్మద్ నిజాముద్దీన్, మహ్మద్ సయ్యద్ ఖాన్, అమ్మడపల్లి కార్తిక్, శోభన్, చింతపల్లి కామేశ్వర్‌రావును అరెస్టు చేశారు. ప్రధాన డీజిల్ స్మగ్లర్ రాధాకృష్ణ, డోర్‌స్టెప్ డీజిల్ సర్వీసెస్ కంపెనీ యజమాని, డీజిల్ స్మగ్లర్ సూర్య అలియాస్ సాయిరాం సూర్య, డోర్‌స్టెప్ డీజిల్ సర్వీసెస్ కంపెనీ సూపర్‌వైజర్ రిషి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డీజిల్‌తో పాటు రూ.35 లక్షల విలువజేసే ఏడు చిన్న ట్యాంకర్ వాహనాలను కూడా సీజ్ చేశారు. డీజిల్ స్మగ్లర్ రాధాకృష్ణపై గతంలో కూడా గచ్చిబౌలి తదితర ఠాణాల్లో కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు.

## మే నెలలో మరింత ఎండలు

### హెచ్చరిస్తున్న వాతావరణ అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఏప్రిల్ నుంచే ఎండలు మండిపోతున్నాయి. గతంతో పోల్చితే ఈసారి వేసవిలో క్యూములోనింబస్ మేఘాలు కూడా పెద్దగా ఏర్పడకపోవడంతో వేసవిలో కురవాల్సిన వానలు కూడా కురవలేదు. దీనికి తోడు.. కింది స్థాయి గాలులు ఆగ్నేయం నుంచి తెలంగాణ వైపు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు 40 దాటి నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా గాలిలో తేమ పడిపోయి ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అయితే, రానున్న మే నెలలో ఎండల ప్రభావం మరింత తీవ్రంగా ఉండనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండేవి. కానీ, ఈ వేసవిలో మాత్రం ఉష్ణోగ్రతలు వరుసగా 39 -40 డిగ్రీలు, ఆపై స్థాయిలో నమోదవుతున్నాయి. ఇక రానున్న మే మాసంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటి 42- 43 డిగ్రీలు చేరుకునే అవకాశాలు లేకపోలేదని, దీనికి తోడు వడ గాలులు కూడా వీచే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులతో వడదెబ్బ ప్రమాదం పొంచి ఉన్నదని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప.. పగలు 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సమయంలో బయటకు వెళ్లకపోవడం ఉత్తమమని సూచిస్తున్నారు. పిల్లలు, పెద్దలందరూ నీరు ఎక్కువగా తాగాలని, తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కూల్ డ్రింక్స్, వీధుల్లో విక్రయించే చల్లటి పానీయాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఫుడ్ పాయిజన్, డయేరియా వంటి వాటి బారిన పడే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా కొబ్బరినీళ్లు, తాజాపండ్ల రసాలు, మజ్జిగ, జావ.. వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వాంతులు, విరేచనాలు, వడదెబ్బ వంటి వాటికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.




## డెకాయి ఆపరేషన్లతో.. పోకిరీల పనిపడుతున్నాం..

### మహిళా భద్రత డీసీపీ ఉషా విశ్వనాథ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): విద్యార్థినులు, యువతులు, మహిళలను వేధించే పోకిరీలపై నిరంతరం నిఘా ఉంటుందని, షీ టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నాయని రాచకొండ మహిళా భద్రత డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 15 రోజుల్లో పట్టుబడ్డ 120 మంది ఆకతాయిలకు ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మహిళా భద్రత ఏసీపీ వెంకటేశం తదితరులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పోలీసు కమిషనర్ ఆదేశాలతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించేందుకు మఫ్టీలో తిరిగే షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మహిళలను వేధించే పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. వేధింపులకు పాల్పడుతున్న 120 మందిని అరెస్టు చేయగా, అందులో మేజర్స్ -76, మైనర్స్-44 ఉన్నారని తెలిపారు. వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. కాగా, షీ టీమ్స్‌కు 15 రోజుల్లో 142 ఫిర్యాదులు అందాయన్నారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నేడు ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్

### స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11.50 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. బోడుప్పల్, చెంగిచర్ల, పీర్జాదిగూడ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు భాగయత్ లేఅవుట్ నుంచి నాగోల్ వైపు, ఎల్బీనగర్ వైపు నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు హెచ్‌ఎండీఏ లేఅవుట్ నుంచి బోడుప్పల్, చెంగిచర్ల ఎక్స్ రోడ్డు వైపు... తార్నాక వైపు నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు నాచారం, చర్లపల్లి వైపు నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు.

## తనిఖీలు ముమ్మరం

### రూ.16.14 కోట్ల నగదు స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 16.14 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. రూ.ఏడుకోట్ల 15 లక్షల విలువజేసే ఇతర వస్తువులు, 21,164.9 లీటర్ల అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నట్లు చెప్పారు. 224 మందిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 456 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించారని, 303 మందిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2,980 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు రోనాల్డ్‌రాస్ తెలిపారు. తాజాగా.. గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.70.56 లక్షల నగదు, రూ.1.54 లక్షల విలువైన వస్తువులను పట్టుకొని, సీజ్ చేసినట్లు చెప్పారు.

## వృద్ధుడి అదృశ్యం..

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 24: నగరంలో ఉన్న కుమారుడి వద్దకు వచ్చిన జైపూర్‌కు చెందిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కుషాయిగూడ పోలీసుల కథనం ప్రకారం.. హమాన్సు శేఖర్ ఉపాధి కోసం నగరానికి వచ్చి కుషాయిగూడ నాగార్జునగర్ కాలనీలో ఉంటున్నాడు. ఇటీవల ఒడిశా నుంచి నగరానికి వచ్చిన అతడి తండ్రి ప్రసాద్ (90) కనిపించడంలేదు. ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన తన తండ్రి తిరిగి రాలేదని, పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొంటూ శేఖర్ కుషాయిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రసాద్ ఆచూకీ తెలిస్తే కుషాయిగూడ పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.


ప్రసాద్ (ఫైల్)

# ఆధారాలు చూపిస్తే.. నగదు వెనక్కి

### 107 కేసుల్లో రూ.3.60 కోట్ల నగదు సీజ్

### ఆధారాలు చూపడంతో రూ.2.69 కోట్లు విడుదల

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన 107 కేసుల్లో రూ.50 వేలకు మించి ఆధారాలు లేని రూ.3.60 కోట్ల నగదును సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఈ నగదును సంబంధిత జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సిఫారసు చేసినట్టు తెలిపారు. 102 కేసులకు సంబంధించిన పత్రాలు చూపడంతో డీజీసీ ద్వారా రూ.2.69 కోట్ల నగదును విడుదల చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన నగదులో రూ.10 లక్షలు మించి పట్టుబడిన రెండు కేసులకు సంబంధించిన రూ. 24,97,000 లను ఐటీ, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు పంపినట్టు వెల్లడించారు. అదే విధంగా.. మూడు కేసుల్లో రూ.66,49,000 ఐటీ శాఖ సీజ్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నమోదైన 70 కేసుల్లో రూ.2,49,93,530 నగదును సీజ్ చేయగా, ఇందులో 66 కేసుల్లో రూ.1,73,44,530 నగదు రిలీజ్ చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్‌కు సంబంధించి నమోదైన 37 కేసుల్లో రూ.1,10,88,365 నగదును సీజ్ చేయగా, సరైన ఆధారాలు సమర్పించిన 36 కేసుల్లో రూ.95,36,365 నగదు, రూ.55 వేల విలువజేసే బంగారు, వెండి వస్తువులు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నమోదైన 8 కేసుల్లో డీజీసీకి సిఫారసు చేసిన రూ. 35,15,060 నగదు, రూ.8,24,055 విలువజేసే ఇతర వస్తువుల్లో.. డీజీసీ ద్వారా ఐదు కేసులకు సంబంధించి రూ.8,34,000 నగదు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మూడు కేసులను రూ.35,04,215 ఐటీ శాఖకు పంపినట్టు డీఈఓ తెలిపారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ 9618888110, కమిటీ కన్వీనర్ 9177872240లో సంప్రదించవచ్చని తెలిపారు. నగదు సీజ్‌కు గురైన వారు పూర్తి ఆధారాలతో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన కారు

### మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన యువకుడు



బంజారాహిల్స్, ఏప్రిల్ 24: అతివేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ఘటన జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమెరికాలో నివాసముంటున్న ముగ్గురు ఎన్‌ఆర్ఐ యువకులు, ఓ జర్మన్ యువకుడు, అమెరికాకు చెందిన ఓ యువతి కలిసి స్నేహితుడి వివాహం కోసం రెండు రోజుల కిందట నగరానికి వచ్చారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో బస చేసిన వీరంతా.. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం. 37లోని కారా పబ్‌లో మద్యం సేవించారు. అక్కడి నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత బెంజ్ కారులో పార్క్ హయత్‌కు వెళ్లేందుకు బయలుదేరారు. వెంకటేశ్ అనే యువకుడు కారు డ్రైవింగ్ చేస్తుండగా.. మిగిలిన వారంతా కారులో కూర్చున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36 నుంచి వేగంగా వస్తూ 36/10 వద్దకు రాగానే.. వేగంతో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద కారు అదుపుతప్పి, నేరుగా ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. ఫుట్‌పాత్‌పైకి ఎక్కడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను, ఫ్యూజ్ బాక్సును ఢీకొట్టింది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో వాహనంలో ఉన్న యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, కారులోని యువకులను బయటకు తీయడంతో పాటు వారిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. కారు డ్రైవింగ్ వెంకటేశ్‌తో పాటు ముగ్గురు మద్యం సేవించినట్లు తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి 38 నామినేషన్లు

మేడ్చల్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి బుధవారం 38 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి నామినేషను దాఖలు చేశారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, బండారి లక్ష్మారెడ్డి

## ఎంఎన్‌సీలో ఉద్యోగమంటూ ఫోన్లు

### రూ.3,500 రిజిస్ట్రేషన్ ఫీ అంటూ మోసాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు మరోకొత్త మోసానికి తెరలేపారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారి డేటాను సేకరించి..ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాలంటూ..రిజిస్ట్రేషన్ పేరుతో రూ. 3,500 చెల్లించాలంటూ..బురిడీ కొట్టిస్తున్నారు. యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. కొంతమంది నేరగాళ్లు ప్రత్యేకంగా వెబ్‌సైట్లు ఏర్పాటు చేసుకొని, కాల్ సెంటర్ల ద్వారా నిరుద్యోగులకు ఫోన్ చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారినే టార్గెట్ చేస్తారని, రూ.3500 చెల్లించి తన పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగం ఆశలో నిరుద్యోగుల డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉంటారని, డబ్బు విషయాన్ని ఎవరైనా ప్రస్తావిస్తే ఎంత మాత్రం నమ్మవద్దని సూచిస్తున్నారు. ఉద్యోగం కోసం ఎవరైనా.. ఎక్కడైనా డబ్బు ప్రస్తావన తెచ్చారంటే.. అది మోసమని గుర్తించి, మోసాల బారిన పడకుండా ఉండాలంటూ సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు.

## సౌత్‌జోన్ డీసీపీపై ఈసీ వేటు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్యపై ఎన్నికల సంఘం వేటు వేసింది. ఈ మేరకు ఈసీ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు ఎన్నికల విధులకు సంబంధం లేని బాధ్యతలను అప్పగించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ మేరకు సౌత్ జోన్ అడిషనల్ డీసీపీకి ఇన్‌చార్జి డీసీపీగా బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ రవిగుప్తా ఆదేశాలు జారీ చేశారు.

## తుది అంకానికి నామినేషన్ల పర్వం

### నేడు మధ్యాహ్నం 3 గంటలతో..

### ముగియనున్న నామినేషన్ దాఖలు గడువు

### 29 వరకు ఉపసంహరణ

### మరింత హీటెక్కనున్న అభ్యర్థుల ప్రచారం

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు చివరి అంకానికి చేరింది. ఈ నెల 18 నుంచి మొదలైన నామినేషన్ల దాఖలు నేటి మధ్యాహ్నం 3 గంటలతో ముగియనున్నది. కాగా, నామినేషన్ల ఉప సంహరణకు 29వ తేదీ చివరి గడువు కాగా, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్నది. బుధవారం హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి గానూ నామినేషన్ల సందడి కొనసాగింది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి 16 మంది, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి 10 మంది, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి 10 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

#### పతాకస్థాయికి ప్రచారం..

ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పోల్ పోరులో తాడోపేడో తేల్చుకునేందుకు పోటీ పడుతున్నారు. అగ్రనేతల ప్రచారంతో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గ సమన్వయ సమావేశాలు, బూత్ లెవల్ మీటింగ్‌లు, ఉదయం, సాయంత్రం సమయాల్లో పాదయాత్రలతో పార్లమెంట్ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఇందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం మధ్యాహ్నంతో ముగియనుండటంతో ప్రచారాన్ని పతాకస్థాయి తీసుకువెళ్లేలా కార్యాచరణ, ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328121

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328125

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-327882

OLD AGE HOME



★వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్ బాత్‌రూమ్, మేడిపల్లి/ ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. NT-311886

TOURS & TRAVELS



★మహదేవ టూర్స్: చార్‌దామ్ యాత్ర 26 మే, దోదామ్ యాత్ర 10 మే, అమర్‌నాథ్ + నవదేవి యాత్ర 2 జులై, అమరనాథ్ + వైష్ణవి 7 జులై, ముక్తినాథ్ యాత్ర 11 జూన్ @ 9908844377. NT-311980

★29/4, 5/5 రామేశ్వరం, అరుణాచలం 22 యా|| *18/5, 8 జ్యోతి, 4 ద్వారకలు, సముద్రంలో శివ లింగాలు. *26/6 చార్‌ధామ్ బద్రీ, కేదార్ 14రో|| *7/9 కాశి, నేపాల్, ముక్తినాథ్ *25/1/2025 గిరిజాదేవి, కలకత్తా, గంగాసాగర్, గౌహతి కామాఖ్య. భాస్కరరావు 9848486847 NT-327893

PLOT FOR SALE



★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ||లు కంపల్సరీ ఉంటుంది. 9177619716. NT-328320

★షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఔట్లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 20 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు సంప్ర: 9949695027. NT-311878

★బీబీనగర్ to అనంతారం, కీసర & ECIL 100 ఫీట్ రోడ్‌కు LRSతో రెసిడెన్షియల్ ప్లాట్లు నియర్ AIIMS & RRR గ|| కే|| 4,000/- మాత్రమే. స్పా||రి||: 9032677876. NT-320389

HOUSE FOR SALE



★G+1 Independent House 110 Sq.Yds, G+2 BHK, 1st Floor 3 Rental Portion @ Subash Nagar, Jeedmetla, Suchitra. Cont: 6300279640. NT-311894

REAL ESTATE LAND WANTED

★HMDA/ DTCP Approved Layouts కావలెను. Lands 10 నుండి 50 Acres వరకు. హైదరాబాదు లోపల మార్కెటింగ్ కొరకు మేము తీసుకుంటాము. Immediatly కావలెను. Ph: 8523044468, 7995322122. NT-339485

WANTED



★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ చేయుటకు Executives (M) Insurance Agents, రిటైర్డ్ ఎంప్లాయిస్, హౌస్‌వైఫ్స్ Any Business Persons, Students, Agents (పార్ట్ /ఫుల్ టైమ్) కావలెను. Fixed Salaries, Commissions, Incentives & Foreign Trips. Ph: 7355469999 / 8143111155. NT-1215

★Drivers, Ayahs, Sisters, DMOs, Gynec, Specialists Sreedhar Kidney ivf Polyclinics, Mehidipatnam Gachibowli. Ph: 9000031893, 9059343005, 9848030473 NT-311893

★అర్జెంటుగా (తెలుగు) మాట్లాడే టె||కాలర్, సె||గార్డ్స్, హౌస్ కీపింగ్ M/F స్టాఫ్ కావలెను. Qly: 10th-P.G. జీ: 15K-25K. స్పాట్ జాయినింగ్ (ఆల్ ఏరియాస్). ఫోన్: 6309433980, 7396900132. NT-327998

★డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లిట్ CNG కార్ డ్రైవ్ చేయండి మరియు నెలకు రూ. 25,000/- సంపాదించండి!! +91 9324912075కి కాల్ చేయండి. NT-00230

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899. NT-311831-All

SECURITY GUARDS & DRIVERS

★ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయడానికి సెక్యూరిటీ సిబ్బంది పురుషులు మరియు స్త్రీలు కావలెను 12 గంటలు జీతం: 13K to 14K మరియు వాలెట్ పార్కింగ్ డ్రైవర్స్ కావలెను. 16K జీతం. మదినగూడ, చింతాల్, బీఎన్ రెడ్డి, ఎస్ రావు నగర్. ఫోన్: 8500199996. NT-327891

CHANGE OF NAME

★I, AADIRA BABY, D/o. Biju Kumar B, R/o.50-90/A/1, Vandanapuri Colony, Beeramguda, Sangareddy-502032, TS. Have Changed My Name to **AADIRA BIJU** for all future Correspondence. NT-3592

★I, RUDRA VENKATA SITA RAMARAJU, S/o. Rudraraju Trimurty Raju, R/o. HIG 422, Madhavanagar Colony, BHEL T/S, Hyderabad-502032. Changed my Name to **RUDRARAJU VENKATA SITA RAMARAJU** for all purposes. NT-4831

LOST

★I, DAMMALA ARTABAN, S/o. Sri Dammala Poolabai, R/o. H.No. 8-43/47/1/ 1, East Balaji Hills, Boduppal, K.V.Ranga Reddy, Hyderabad-500092, Telangana State, have lost my Original Link Sale Deed Doct.No. 5693 of 1994 SRO at Uppal, while travelling from Uppal to Dilsukhnagar, If any body found please return the same to the above address or Call 8008793943. NT-97201

★I, V.V. NAGA MOHAN, S/o. V.N. MUTYALAIAH, R/o. Flat No. 11024, Block-1, Janapriya Utopia, Attapur, Hyderabad-48, T.S. I lost my Passport No. A6218857, Date of Issue: 08-09-1998, while travelling at Attapur House Shifting Cont: +91 9032502129. NT-327802

★I, PABBATHI VINODA, W/o. Pabbathi Shekar Reddy, R/o. H.No. 2-12-67, Beerappagadda, Uppal, Medchal Malkajgiri Dist., T.S., I am owner of Pass Port, its Regd No. L1287574, above said Passport has been lossed by me while House Shifting Beerappagadda to Uppal, if found any one pls contact me. 9246543664. NT-328128

LOSS OF SHARE CERTIFICATE

★I, VELLANKI JANAKI, W/o. GUDLAVALLETI UDAY BHASKAR, R/o. Cottage No. 40 (3-39) Dhanya Prastha Township, Majeedpur Village, Aliyabad Post, Shamirpet Mandal, R.R.Dist., TS., have state that my husband held 180 No. Shares of ITC. Shares under Folio No. 02/35917 bearing Certificate No. 6765, 72792 & 157903 and Distinctive Nos. 13196421-3196480, 2510022831-2510022860 & 3839081523-3839081612 respectively. The above said share certificates were lost during the repair of the house. If anybody found please Contact:6302032014. NT-327802

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

పూర్తి వివరాలకు: 'నమస్తే తెలంగాణ' ప్రధాన కార్యాలయం, #8-2-603, 1/7, 8 & 9, Krishnapuram, Rd. No.10, Banjara Hills, Hyderabad-34. Cell: 9848077857

చిక్కడపల్లి, సికింద్రాబాద్ : 9182777202
మల్కాజిగిరి, E.C.I.L: 9182777125
అమీర్‌పేట్, మెహదీపట్నం : 9182777126
ఉప్పల్, తార్నాక : 9182777806
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.